సాక్షి
అనకాపల్లి
ఆదివారం • 21 • మే • 2023



ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్

విశాఖ: హైస్కూల్ ప్లస్ 2 ఉపాధ్యాయుల నియామకాల కోసం విద్యాశాఖాధికారులు స్కూల్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్ జరిపారు.



అప్పన్న సన్నిధిలో..

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని ఆర్టీఐ కమిషనర్ రేపాల శ్రీనివాస రావు శనివారం దర్శించుకున్నారు.



కనకమ్మ హుండీ లెక్కింపు

విశాఖ: కనకమహాలక్ష్మి హుండీ లెక్కింపులో 50 రోజులకు రూ.36.74 లక్షలు, 73.200 గ్రాముల బంగారం లభించాయి.

న్యూస్‌రీల్

15 రోజుల్లో అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణ పనులు

సీఐఐ ప్రాంతీయ సదస్సులో మంత్రి అమర్‌నాథ్





మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణ పనులు 15 రోజుల్లో మొదలు పెట్టే అవకాశం ఉందని ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వెల్లడించారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధిపై సీఐఐ ఆధ్వర్యంలో స్థానిక హోటల్లో శనివారం సమావేశం నిర్వహించారు. షీలానగర్ నుంచి గాజువాక మీదుగా అనకాపల్లికి రహదారిని విస్తరించాలని, షీలానగర్ నుంచి లంకెలపాలెం ఫార్మా సిటీకి మరొక ప్రత్యేక రోడ్డు ఏర్పాటు చేయాలని పారిశ్రామికవేత్తలు కోరారు. విశాఖ ప్రాంతంలో రోడ్ల విస్తరణకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని, చిన్న చిన్న సాంకేతిక సమస్యలను అధిగమించి నిర్మాణ పనులు త్వరలోనే చేపడతామని మంత్రి చెప్పారు. పారిశ్రామిక అవసరాల కోసం భూమిని తీసుకున్న సమయంలో వేకెంట్ ల్యాండ్ టాక్స్ చెల్లించడం భారమవుతోందని పారిశ్రామికవేత్తలు మంత్రి అమర్‌నాథ్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై క్షుణ్ణంగా చర్చించి పారిశ్రామికవేత్తలకు మేలు జరిగే నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

పాలిసెట్‌లో తోటాడ విద్యార్థుల జయకేతనం



శరగడం షణ్ముక్ (469), కాండ్రేగుల సౌజన్య (899), బొడ్డేడ పవన్‌తేజ (1170)

మునగపాక : మండలంలోని తోటాడ జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు పాలిసెట్‌లో మెరుగైన ఫలితాలు సాధించారు. శనివారం విడుదలైన ఫలితాల్లో మూలపేటకు చెందిన శరగడం షణ్ముక్ 120 మార్కులకు 107 మార్కులు సాధించి 469వ ర్యాంక్ సాధించాడు. పాటిపల్లి మోడల్ స్కూల్‌కు చెందిన కాండ్రేగుల సౌజన్య 100 మార్కులతో 899వ ర్యాంక్, సిరసపల్లికి చెందిన బొడ్డేడ పవన్‌తేజ 97 మార్కులతో 1170వ ర్యాంక్ సొంతం చేసుకున్నారు. కాగా మండలానికి చెందిన ముగ్గురు విద్యార్థులు పాలిసెట్‌లో మంచి ఫలితాలు సాధించడం పట్ల పలువురు అభినందించారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించిన కలెక్టర్



వెదురువాడలో జగనన్న లే అవుట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

అచ్యుతాపురం (అనకాపల్లి): మండలంలోని వెదురువాడలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి శనివారం పర్యటించారు. జగనన్న లే అవుట్ ఇళ్ల స్కీం నిర్మాణాలను పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా ఈ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎంపీడీవో విజయలక్ష్మి, తహశీల్దార్ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భార్య అంటే ప్రేమ ఉన్నవారు..

SUNDAY SPECIAL

దయచేసి ఇది చదవండి

ఏడాది కాలంలో	వేసక్టమీ ఆపరేషన్లు చేయించుకున్న పురుషులు	ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేయించుకున్న మహిళలు
	19 మంది	2,456 మంది

నవమాసాలు కడుపులో బిడ్డను మోయాల్సిన బాధ భార్యకే.. పునర్జన్మగా భావించే పురుడు పోసుకోవలసింది భార్యే.. బాలింతగా అనేక జాగ్రత్తలతో బిడ్డను సాకాల్సింది భార్యే.. ఈ బరువు బాధ్యతలను ఆమె తప్ప ఇంకెవరూ నెరవేర్చలేరు. కనీసం కుటుంబ సంక్షేమ (నియంత్రణ) శస్త్రచికిత్సనైనా భర్త చేయించుకుంటే ఆమెకు కొంత బాధ తప్పుతుంది కదా. ఇంటికి దీపం ఇల్లాలు. ఆమె ఆరోగ్యం చక్కగా ఉంటేనే కుటుంబం పచ్చగా ఉంటుంది. ఆ దిశగా మగవారు ఆలోచించకపోవడం భావ్యమా?

ఎస్.రాయవరం మండలానికి చెందిన రోహిణీదేవి భర్తతోపాటు వ్యవసాయ పనులకు వెళ్లి జీవనం సాగిస్తోంది. ఆమెకు ముగ్గురు సంతానం కావడంతో ఇక చాలనుకుని ఇటీవలే కుటుంబ సంక్షేమ ఆపరేషన్ చేయించుకుంది. నీ భార్య కంటే నువ్వు ఆపరేషన్ చేయించుకుంటే మేలు కదా.. పది నిమిషాలలోనే పూర్తవుతుందని ఏఎన్ఎం నచ్చజెప్పినా భర్త వినలేదు. 'ఆపరేషన్ చేయించుకుంటే శక్తి తగ్గిపోతుందని చాలామంది చెబుతున్నారు.. నేను చేయించుకోన'ని మొండికేయడంతో భార్యకు కుటుంబ సంక్షేమ ఆపరేషన్ చేయకతప్పలేదు.

యలమంచిలి మండలానికి చెందిన సత్యనారాయణ మూడు నెలల క్రితం వేసక్టమీ ఆపరేషన్ చేయించుకున్నాడు. కేవలం 10 నిమిషాల్లోనే వైద్యులు అతనికి ఆపరేషన్ చేశారు. తన భార్యకు అప్పటికే రెండుసార్లు సిజేరియన్ కావడంతో ఆమెపై మరింత భారం మోపడం ఇష్టం లేక ఆయనే కుటుంబ సంక్షేమ ఆపరేషన్ చేయించుకుని ఆదర్శంగా నిలిచారు. ఆపరేషన్ చేయించుకున్నా తనకు ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పారు.

అనకాపల్లి మండలానికి చెందిన నాగమణికి ఇద్దరు పిల్లలు. కుటుంబ సంక్షేమ (ట్యూబెక్టమీ) ఆపరేషన్ చేయించుకుంది. 'ఇంట్లో పనిచేసుకుంటావు. నీ భర్తకు ఆపరేషన్ చాలా సులభంగా వుంటుంది. ఆయనకెలాంటి ఇబ్బంది వుండద'ని వైద్య సిబ్బంది చెప్పారు. కానీ ఆమె వినలేదు. ఆయన బయట తిరుగుతాడు.. ఓపిక వుండదని, ఇక ఏ పనీ చేయలేడని, అందుకే తాను ఆపరేషన్ చేయించుకున్నట్టు చెప్పడంతో వైద్య సిబ్బంది అవాక్కయ్యారు.

అనకాపల్లి రూరల్: కుటుంబ సంక్షేమ ఆపరేషన్ చేయించుకోవడానికి కేవలం మహిళలే ముందుకు వస్తున్నారు. దీనికి పురుషులు అమడదూరంలో వుంటున్నారు. ఫలితంగా జిల్లాలో వేసక్టమీ ఆపరేషన్ చేయించుకునే మగవాడు కన్పించడం లేదు. అనకాపల్లి జిల్లా ఏర్పడిన తరువాత 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు కేవలం 19 మంది మాత్రమే ఈ ఆపరేషన్ చేయించుకున్నారు. అదే సమయంలో 2,456 మంది మహిళలు ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించుకోవడం గమనార్హం. ఎలాంటి దుష్ప్రభావాలు లేవని చెబుతున్నా పురుషులు వేసక్టమీ ఆపరేషన్లకు ఆసక్తి చూపడం లేదు. పారితోషికం ఇస్తామన్నా తమకు ఇష్టం లేదంటున్నారు. వెరసి సిజేరియన్లతోపాటు మహిళలే ట్యూబెక్టమీ ఆపరేషన్లకు ముందుకు రావల్సిన పరిస్థితి ఏర్పడింది. తమకు శక్తి తగ్గిపోతోందని బరువైన, వ్యవసాయ పనులు చేపట్టలేమన్న భావనతో మగవారు ముందుకు రావడానికి భయపడుతున్నారని వైద్య సిబ్బంది చెబుతున్నారు. దీనిపై వైద్య, ఆరోగ్యశాఖాధికారులు నిత్యం అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.



అపోహ మాత్రమే

కుటుంబ సంక్షేమ ఆపరేషన్ చేయించుకుంటే తమకు బలహీన వస్తుందని ,బరువైన పనులు చేయలేమని భావిస్తున్న పురుషులు శస్త్రచికిత్సలు చేయించుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. ఆపరేషన్ వల్ల ఎలాంటి శారీరక బలహీనత ఏర్పడదు. శక్తి సామర్థ్యాలు ఏ మాత్రం కోల్పోరు. సంసార జీవితానికి ఎలాంటి ఢోకా వుండదు.

12 నెలల్లో 19 మందే..

జిల్లాలో గడచిన 12 మాసాల్లో వైద్య, ఆరోగ్యశాఖ గణాంకాలు పరిశీలిస్తే కేవలం 19 మంది పురుషులు మాత్రమే కుటుంబ సంక్షేమ ఆపరేషన్లు (వేసక్టమీ) చేయించుకున్నారు. 2,456 మంది మహిళలు ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేయించుకోగా.. పిల్లలు పుట్టిన 7 రోజుల తరువాత కుటుంబ నియంత్రణ కోసం ఐయూసీడీ (కాపర్ టీ) చేయించుకున్నవారు మరో 4,238 మంది మహిళలు. కోత, కుట్లు లేకపోయినా.. రక్త స్రావం వచ్చే ఆస్కారం లేకపోయినా.. ఆపరేషన్ అనంతరం దాంపత్య జీవితానికి ఎలాంటి ఇబ్బంది లేకపోయినా మగవారు ఈ ఆపరేషన్ చేయించుకోవడానికి ముందుకు రావడం లేదు. ఈ ఆపరేషన్‌పై ప్రజల్లో ఉన్న అపోహలు, అనుమానాలు తొలగించేందుకు వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది మరింత శ్రద్ధగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది.



నక్కపల్లి ఏరియా ఆస్పత్రిలో ట్యూబెక్టమీ శస్త్రచికిత్స చేయించుకున్న బాలింతలు (ఫైల్)

కనీస బాధ్యత

కుటుంబ సంక్షేమ ఆపరేషన్లు మహిళలే కాదు, పురుషులు కూడా చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. పురుషులకైతే ఇది పదినిమిషాల్లో పూర్తవుతుంది. ఆపరేషన్ తరువాత 2 గంటల్లోనే ఇంటికి వెళ్లిపోవచ్చు. అన్ని రకాల ఆహారపదార్థాలు తీసుకోవచ్చు. వేసక్టమీ తరువాత పిల్లలు కావాలనుకున్నప్పుడు రీ కెనలైజేషన్ చేయించుకోవచ్చు. దీనికి తోడు వేసక్టమీ ఆపరేషన్ చేయించుకునే వారికి పారితోషికంగా రూ1100, ట్యూబెక్టమీకి రూ.600 ప్రభుత్వం అందజేస్తోంది. అయినా ససేమిరా అంటున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



క్షేత్ర స్థాయిలో కుటుంబ సంక్షేమ ఆపరేషన్లపై అవగాహన కల్పిస్తున్నాం. అయినా పలు రకాల అపోహలతో మగవారు వేసక్టమీ ఆపరేషన్ చేయించుకోవడానికి ముందుకు రావడం లేదు. మహిళలు సైతం తమ భర్తకు ఆపరేషన్ వద్దని, తామే చేయించుకుంటామని చెబుతున్నారు. కుటుంబ సంక్షేమ ఆపరేషన్ అంటే మహిళలే చేయించుకోనవసరం లేదు. మగవారు కూడా నిరభ్యంతరంగా చేయించుకోవచ్చు. మహిళల కంటే పురుషులకే చాలా సులభమైన ఆపరేషన్. దీని వల్ల ఎటువంటి శారీరక బలహీనత ఏర్పడదు. – ఎ.హేమంత్, డీఎంహెచ్‌వో

టిడ్కో గృహాలకు సకల సదుపాయాలు

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

అనకాపల్లి రూరల్ : టిడ్కో గృహాలకు ప్రభుత్వం సకల సదుపాయాలు కల్పిస్తోందని, ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాల్సిందిగా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని జీవీఎంసీ కమిషనర్ ఎం.సాయికాంత్‌వర్మ చెప్పారు. స్థానిక సత్యనారాయణపురంలో నిర్మిస్తున్న టి డ్కో ఇళ్ల నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. సత్యనారాయణపురంలో 2,744 టిడ్కో గృహాలను నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఈ గృహాలకు డ్రైనేజీలు, విద్యుత్, అంతర్గత రహదారులు, తాగునీటి సరఫరా వంటి సదుపాయాలు పూర్తిగా కల్పిస్తున్నామని చెప్పారు. కొన్ని చోట్ల రహదారులు నిర్మించాల్సి వుందన్నారు. 116 మంది లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాల్సివుందని, 123 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేయాల్సి వుందని చెప్పారు. వీటిని త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సత్యనారాయణపురంలో టిడ్కో గృహాలను కమిషనర్ సాయికాంత్ వర్మ పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. త్వరితగతిన ఇళ్ల పంపిణీ జరిగేందుకు చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. ఆయన వెంట ప్రాజెక్ట్ డైరెక్టర్ పాపునాయుడు, పర్యవేక్షక ఇంజినీర్ రామ్మోహన్‌రావు, జోనల్ కమిషనర్ ఎస్వీ రమణ, హౌసింగ్ అధికారి సుధాకర్ పాల్గొన్నారు.



సత్యనారాయణపురంలో టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

కేజీబీవీలో జూనియర్ కాలేజీ భవనాలు ప్రారంభం

- రూ.1.60 కోట్లతో అదనపు తరగతి గదులు
- ప్రారంభించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

చీడికాడ : జి.కొత్తపల్లి కేజీబీవీలో నూతనంగా నిర్మించిన ఇంటర్ కళాశాల భవనాలను డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు శనివారం ప్రారంభించారు. ఈ పాఠశాలలో గతేడాది నుంచి ఇంటర్ కాలేజీ ప్రారంభం కావడంతో భవనాల కొరత ఏర్పడింది. దీంతో కాలేజీ నిర్వహణకు అవసరమైన అధనపు భవనాల నిర్మాణానికి ఎస్ఎస్ఏ ఫండ్స్ రూ.1.60 కోట్లు మంజూరు చేశారు. వీటితో మూడు తరగతి గదులు నిర్మించారు. వీటిని పాఠశాల పీఎంసీ చైర్మన్ పాతాళం అర్జునతో కలిసి బూడి ప్రారంభించారు. అనంతరం పాఠశాల ముఖద్వారం నుంచి పాఠశాల ప్రధాన భవనం వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి వెంటనే కొలతలు తీసుకుని పనులు ప్రారంభించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కాలేజీకి సంబంధించి మౌలిక వసతులు అవసరమైతే తన దృష్టికి తీసుకురావాలని స్పెషల్ ఆఫీసర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొల్లి నాగమణి, ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీ లాలం శారదా జానకీరాం, స్పెషల్ ఆఫీసర్ ఆర్.సుధారాణి, పీఎంసీ చైర్మన్ పి.అర్జున్, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, స్థానిక నేతలు కొల్లి శ్రీను, పుట్టా రాంకుమార్, సలాది గంగశేషు, కన్నూరి చెల్లంనాయుడు, నందారపు రమణబాబు, ఈర్లె చైతన్య, పడాల అప్పలనాయుడు, మత్సరాజు, మజ్జి దేవానంద్, పాతాళం చిన్నంనాయుడు, విస్సారపు శ్రీను, సాయి, రామారావు పాల్గొన్నారు.



కాలేజీ భవనాలను ప్రారంభించి శిలాఫలకం ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

పరిశ్రమల స్థాపనకు రూ.20 కోట్లు

పీఎంఈజీపీ డీడీ సుబ్రహ్మణ్యం

నర్సీపట్నం: ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ ద్వారా పరిశ్రమల స్థాపనకు రూ.20 కోట్ల మేర రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు పీఎంఈజీపీ డిప్యూటీ డైరెక్టర్ దేవరకొండ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. నర్సీపట్నం వచ్చిన సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత ఏడాది రూ.14.20 కోట్ల రుణాలు ఇచ్చామన్నారు. పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే వారికి రూ.50 వేల నుంచి రూ.50 లక్షల వరకు సబ్సిడీతో కూడిన రుణాలు అందజేస్తామన్నారు. 35 శాతం సబ్సిడీ వర్తిస్తుందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా లంబసింగిలో చిరుధాన్యాల క్లస్టర్ ఏర్పాటుకు రూ.200 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. ఈ క్లస్టర్ ఏర్పాటుతో దళారులను ఆశ్రయించకుండా ప్రాసెసింగ్ చేసుకుని అమ్ముకునేందుకు గిరిజనులకు వీలు కలుగుతుందన్నారు. ఏటికొప్పాక బొమ్మల తయారీని మరింత ప్రోత్సహించేందుకు క్లస్టర్ సెంటర్ ఏర్పాటుకు రూ.200 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించటం జరిగిందన్నారు. తేనెటీగల పరిశ్రమను మరింత ప్రోత్సహించేందుకు ఈ ఏడాది 200 తేనెటీగల బాక్స్‌లను పంపిణీ చేస్తున్నామన్నారు.



తేనె పరిశ్రమలో రాణిస్తున్న వారికి ప్రశంసా పత్రాలు అందజేస్తున్న డీడీ సుబ్రహ్మణ్యం

తేనెటీగల పెంపకం లాభదాయకం

తేనెటీగల పెంపక పరిశ్రమ లాభదాయకంగా ఉంటుందని ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ) డిప్యూటీ డైరెక్టర్ దేవరకొండ సుబ్రహ్మణ్యం అన్నారు. నర్సీపట్నం మండలం వేములపూడి స్వరాజ్య సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రపంచ తేనెటీగల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తేనె పరిశ్రమ ద్వారా ఎంతోమంది నిరుద్యోగులు ఉపాధి పొందుతున్నారన్నారు. తేనెటీగల పెంపకాన్ని ప్రారంభించే వారికి పీఎంఈజీపీ ద్వారా ఐదు రోజులపాటు శిక్షణ ఇవ్వడంతో పాటు రాయితీపై బాక్స్‌లు, రెండు రకాల తేనెటీగలను సరఫరా చేస్తున్నామన్నారు. నిరుద్యోగులు, నిరక్షరాస్యులు ఈ పరిశ్రమ స్థాపనకు ముందుకువచ్చినట్లయితే సబ్సిడీతో కూడిన రుణసదుపాయాన్ని కల్పిస్తామన్నారు. అనంతరం తేనె పరిశ్రమల ద్వారా రాణిస్తున్న నిర్వాహకులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. తేనెటీగల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వరాజ్య సంఘం అధ్యక్షులు ఇందల వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, ఔత్సాహికులు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్షలు ప్రశాంతం

అనకాపల్లి టౌన్: జిల్లాలో 9 పరీక్ష కేంద్రాల్లో శనివారం ఉదయం ఏపీఆర్ఎస్ సీఏటీ 2023-24 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 5వ తరగతి ప్రవేశ పరీక్షకు 1,219 మంది, 6వ తరగతికి 255 మంది, 7వ తరగతికి 84 మంది, 8వ తరగతి ప్రవేశపరీక్షకు 28 మంది హాజరయ్యారని డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ చెప్పారు.

మధ్యాహ్నం 13 పరీక్ష కేంద్రాల్లో 2023-24 ఏపీఆర్‌జేసీ అండ్ డీసీ ప్రవేశ పరీక్షలు జరిగాయి. ఇంటర్ ఎంపీసీ ప్రవేశపరీక్షకు 1,837 మంది, బైపీసీకి 532 మంది, ఎంఈసీ/సీఈసీ ప్రవేశపరీక్షకు 69 మంది హాజరయ్యారు. బీఏ డిగ్రీ పరీక్ష ఐదుగురు, బీకాం పరీక్ష 18 మంది, బీఎస్సీ పరీక్ష 27 మంది రాశారు.



వేల్పులవీధి పట్టణ బాలిక హైస్కూల్ ముందు వేచి ఉన్న విద్యార్థులు

23న మినీ జాబ్‌మేళా

అనకాపల్లిటౌన్ : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 23న మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు సంస్థ జిల్లా అధికారి టి.చాముండేశ్వరి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ కల్పనలో భాగంగా మండలంలోని రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగే ఈ జాబ్‌మేళాకు నాలుగు కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఇంటర్వ్యూలకు 10వ తరతగతి నుంచి పీజీ విద్యార్హత కలిగి ఉన్న, 18 నుంచి 35 ఏళ్లలోపు వయసున్నవారు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు 7013342667 నంబర్‌ను సంప్రదించాల్సిందిగా కోరారు.

చంద్రబాబు పెద్ద సైకో

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న దిలీప్‌కుమార్

అనకాపల్లిటౌన్ : పిల్లనిచ్చిన మామ ఎన్టీఆర్‌ని వెన్నుపోటు పొడిచి, ఆయన మరణానికి పరోక్షంగా కారకుడైన చంద్రబాబు కంటే పెద్ద సైకో ఈ రాష్ట్రంలో మరెవరూ లేరని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్టీ ఆర్, ఆయన కుటుంబాన్ని స్వార్థం కోసం వాడుకుని వదిలేసిన వ్యక్తిగా చంద్రబాబును అభివర్ణించారు. పార్టీ అధినేతగా ఎన్నికల్లో గెలిస్తే టీడీపీ ప్రజలకేం చేస్తుందో చెప్పకుండా, చంద్రబాబు పర్యటన విమర్శలకు, ఊకదంపుడు ఉపన్యాసాలకే పరిమితమైందన్నారు. తన పార్టీ జెండా, అజెండా, మేనిఫెస్టో చెప్పుకోలేని పరిస్థితిలో చంద్రబాబు ఉన్నారని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో నెరవేర్చారని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంగా అనకాపల్లిని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్న ఘనత మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కే దక్కుతుందన్నారు. మంత్రి అమర్‌నాథ్‌పై చేసిన విమర్శలు చంద్రబాబు దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. తుమ్మపాల చక్కెర కర్మాగారాన్ని చంద్రబాబు అమ్మకం పెడితే తామంతా న్యాయస్థానాన్ని ఆశ్రయించి అడ్డుకున్న విషయాన్ని టీడీపీ నేతలు గుర్తుంచుకోవాలన్నారు. చక్కెర కర్మాగారంపై ప్రస్తుతం చంద్రబాబు మొసలికన్నీరు కారుస్తున్నారని ధ్వజమెత్తారు. కశింకోట మండలం విస్సన్నపేట భూములపై మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విసిరిన ఛాలెంజ్‌కు చంద్రబాబు కట్టుబడి ఉంటారా అని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణపై భూకబ్జా కేసు నమోదైన విషయాన్ని గుర్తు చేశారు. అలాంటి భూకబ్జాదారులను పక్కన పెట్టుకుని మంత్రి అమర్‌నాథ్‌పై చంద్రబాబు ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు భీశెట్టి వరాహసత్యవతి, యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి గైపూరి రాజు, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు పాల్గొన్నారు.

25న మెజిస్ట్రీరియల్ విచారణ

మహారాణిపేట(విశాఖ) : గత ఏడాది మార్చి 5న కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ కొత్తవలస మండలం రామలింగాపురం గ్రామానికి చెందిన గుంపాన శ్రీను అలియాస్ శ్రీనివాసరావు చనిపోయారని, ఆ మరణాన్ని లాకప్ డెత్‌గా పరిగణించి జిల్లా కలెక్టర్ మెజిస్టీరియల్ విచారణ చేయాలని విశాఖపట్నం ఆర్డీవో హుస్సేన్ సాహెబ్‌ను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 25న కలెక్టరేట్‌లోని కార్యాలయంలో విచారణ చేపట్టనున్నట్లు ఆర్డీవో శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీనివాసరావు ఎస్.కోట సబ్ జైలులో శిక్ష అనుభవిస్తున్న సమయంలో అనారోగ్యానికి గురయ్యారని, గత ఏడాది మార్చి 4న చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారని, 5న మధ్యాహ్నం చికిత్స పొందుతూ మృతిచెందారని తెలిపారు. శ్రీనివాసరావు మరణానికి సంబంధించి తెలిసిన వారు 25న విచారణకు హాజరై లిఖితపూర్వకంగా వివరాలు తెలియజేయాలని ఆయన కోరారు.

ప్రజా సేవ కోసమే వలంటీర్ల వ్యవస్థ

ఉత్తమ వలంటీర్లకు పురస్కారాలు అందించిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



వలంటీర్లను సత్కరించి పురస్కారాలు అందజేస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: ప్రజా సేవ కోసమే వలంటీర్ల వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం ఆవరణంలో గ్రామ సచివాలయ వలంటీర్లకు పురస్కారాలను శనివారం ఆయన ప్రదానం చేశారు. మండలంలోని లక్ష్మీపురం, లక్కవరం, ఖండిపల్లి, గజపతినగరం, జుత్తాడ, గవరవరం గ్రామ సచివాలయ పరిధిలోని సేవా మిత్ర అవార్డులు పొందిన వలంటీర్లకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉత్తమ వలంటీర్లకు శాలువాలు కప్పి ప్రశంసాపత్రాలు, సేవా మిత్ర గుర్తింపు ట్యాగ్‌లు అందజేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అన్ని పథకాలు నేరుగా ప్రజల ఇంటికే అందుతున్నాయంటే, అది కేవలం వలంటీర్ల వ్యవస్థ వల్లేనని ధర్మశ్రీ అన్నారు. ప్రభుత్వ పథకాల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వారికి ఆ కష్టం లేకుండా నేరుగా ఇంటికి అందించేందుకు సీఎం జగన్ వలంటీర్ల, సచివాలయ వ్యవస్థను తెచ్చారన్నారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి చైతన్య, ఎంపీపీ గాడి కాసు, వైస్ ఎంపీపీ బుద్ద గంగరాజు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు శిరుచోళ్ల గణపతినాయుడు, శీరంరెడ్డి వెంకటరమణ, శానాపతి రాజశేఖర్, బలిరెడ్డి నాగేష్, చప్పగడ్డ దేముడమ్మ, మళ్ల శ్రీనువాసరావు, దొడ్డి ప్రసాద్, దంతూరి శ్రీనివాసరాజు, మండల సచివాలయ కన్వీనర్ల అధ్యక్షుడు పతివాడ అప్పారావు పాల్గొన్నారు.

పాత కక్షలతో దాడులు

ఇరువర్గాలపై కేసు నమోదు

మునగపాక : మునగపాక దళితవాడలో శుక్రవారం జరిగిన వివాదానికి సంబంధించి రెండు వర్గాలపై కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ మహమ్మద్ ఆలీ షరీఫ్ తెలిపారు. దళితవాడలోని కాలువ శుభ్రం చేసే కార్యక్రమంలో రెండు వర్గాల వారు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ దాడిలో ఓ బాలునికి చేయి విరిగిపోవడంతో తమకు న్యాయం చేయాలని ఒక వర్గం, అలాగే తమ కుటుంబానికి చెందిన మహిళలపై కొంతమంది దాడి చేశారని మరో వర్గం ఫిర్యాదు చేయడంతో శనివారం రెండు వర్గాలపై కేసులు నమోదు చేశామని షరీఫ్ తెలిపారు. పాత కక్షలతో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారని, కేసు విచారణ చేపడుతున్నామని ఆయన తెలిపారు.

బీజేపీ విశాఖ పార్లమెంటు జిల్లా ఇన్‌చార్జిగా గంగయ్య



మాడుగుల: బీజేపీ విశాఖ పార్లమెంటు జిల్లా ఇన్‌చార్జిగా పార్టీ శిక్షణ తరగతులు త్రిసభ్య కమిటీ సభ్యుడు పుట్టా గంగయ్య నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు నుంచి ఉత్తర్వులు అందినట్లు శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న కృష్ణా జిల్లా గన్నవరంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ బాధ్యతలు అప్పగించారన్నారు. మాడుగులకు చెందిన తాను గతంలో పలు పదవులు నిర్వర్తించానన్నారు. తాజాగా నియామకంపై పార్టీ అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు.

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

తెలుగు, ఇంగ్లిష్ వ్యాకరణంపై శిక్షణ

కశింకోట: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ వ్యాకరణం బోధించారు. అనకాపల్లి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సూరా శ్రీనివాస్ పలు వ్యాకరణాంశాల్లో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.వరలక్ష్మి, కోదండ సీతారామచంద్రమూర్తి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ శిష్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

కశింకోట : మండలంలోని తేగాడలో ఉన్న ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఈ ఏడాది ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మార్తా తిలకం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో 40 వంతున సీట్లు ఉన్నాయన్నారు. టెన్త్‌లో వచ్చిన మార్కుల ప్రాతిపదికన ప్రాధాన్యతా క్రమంలో, రిజర్వేషన్ పరిగణనలోకి తీసుకుని సీట్లు కేటాయించనున్నట్లు వెల్లడించారు. బాలికలకు హాస్టల్ సదుపాయం ఉందన్నారు. తొలుత మండల పరిధిలోని వారికి ప్రాధాన్యం ఇచ్చాక, అనంతరం ఇతర మండలాల వారికి సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ నెల 22 నుంచి వచ్చే నెల 7లోగా ఆన్‌లైన్‌లో అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలు రూ.150, ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200 చొప్పున ప్రవేశ రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. http:// apms. apcfss. in, http:// cse. ap. gov. in వెబ్‌సైట్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

352 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరాన్ని ప్రారంభించిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గొర్లి గోపి

పరవాడ: మండలంలోని గొర్లివానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో స్ఫూర్తి హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు గొర్లి గోపి ప్రారంభించారు. శిబిరంలో 352 మంది సేవలు పొందారు. కంటి ఆపరేషన్లు అవసరమైన రోగులకు అసోసియేషన్ ద్వారా ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించడానికి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొర్లి రామారావు, నాయకులు పైల అప్పారావు, పోలిరెడ్డి అప్పారావు, రొంగలి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 563 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,570	4,950
రెండో రకం	4,000	4,380
మూడో రకం	3,410	3,980

అనకాపల్లి సినిమాలు

కస్టడీ	రాజా
రామబాణం	సత్యనారాయణ-1
అన్నీ మంచి శకునములే	సత్యనారాయణస్క్రీన్-2
ది కేరళ స్టోరీ	షిర్డీసాయి
విరూపాక్ష	పర్తిసాయి
ఫాస్ట్ ఎక్స్	వెంకటేశ్వర
ఉగ్రం	శ్రీసత్య
బిచ్చగాడు-2	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 98 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9 యూనిట్లు, బీ పాజిటివ్-26 యూనిట్లు, ఓ పాజిటివ్-61 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 357 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 327 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

చలివేంద్రాలు.. వేసవి నేస్తాలు

- గ్రీన్‌షెల్టర్లతో ద్విచక్రవాహనదారులకు ఉపశమనం
- ప్రైవేట్ ట్రావెల్స్‌కు తాత్కాలిక బస్ షెల్టర్లుగా వినియోగం
- రూ.7 లక్షలతో 12 చోట్ల చలివేంద్రాలు, గ్రీన్‌షెల్టర్ల ఏర్పాటు



ఉడ్‌పేట వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం



పాతకోర్టు భవనం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం, గ్రీన్‌షెల్టర్

అనకాపల్లిటౌన్ : గొంతెండిపోతున్న పాదచారులకు కాస్త చల్లని తాగునీరు అందించేందుకు జీవీఎంసీ యంత్రాంగం చర్యలు చేపట్టింది. విలీన గ్రామాలతోపాటు పట్టణంలో 12 చోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేసింది. మండువేసవిలో నడిచి వచ్చే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు కాసేపు రోడ్డుపక్కన సేదతీరేందుకు వీలుగా ఆయా చోట్ల గ్రీన్ షెల్టర్లు(హరితాశ్రయం) కూడా నెలకొల్పింది. దీంట్లో కాసేపు సేదతీరి, పక్కనే ఉన్న చలివేంద్రంలో కుండనీరు తాగి ఉపశమనం పొందేలా ఏర్పాట్లు చేసింది.

రూ.7 లక్షలతో ఏర్పాటు

పట్టణంలో పాతకోర్టు భవనం, రామచంద్ర థియేటర్, గాంధీనగరం, నెహ్రూచౌక్, పెరుగుబజారు కూడలి, బాలకృష్ణబస్టాప్, ఆర్టీసీ కాంప్లెక్స్, నూకాంబిక ఆలయం, రింగ్‌రోడ్డు, కొప్పాక, కేఎన్ఆర్ పేట, జాతీయ రహదారి ప్రాంతాల్లో చలివేంద్రాలు, గ్రీన్‌షెల్టర్లు ఏర్పాటు చేశారు. మొత్తం 12 చలివేంద్రాలకు, మరో 12 గ్రీన్‌షెల్టర్లకు రూ.7 లక్షల వరకు ఖర్చు చేశారు. చలివేంద్రాల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు అవసరమైన నీరు ఫిల్ చేసేందుకు 12 మందిని నియమించారు. వీరికి ఒక్కొక్కరికి రోజుకు రూ.300 చొప్పున కూలీ చెల్లించేందుకు జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం కాంట్రాక్టు ఇచ్చింది. వీరు ప్రతి రోజు ఉదయం చలివేంద్రంలో ఉన్న కుండల్ని శుభ్రం చేసి, నీటిని నింపి, పాదచారులకు అందిస్తున్నారు.

సామాజిక బాధ్యతగా..

గతంలో కంటే ఈ ఏడాది ఎండలు దండిగా ఉన్నాయి. పగటిపూట బయటికి రావడానికే జనాలు బయపడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వచ్చిన వారు శీతల పానీయాలకంటే, ఎక్కడైనా కాస్త చల్లని మంచినీరు దొరికితే దాహార్తిని తీర్చుకోవచ్చనుకుంటారు. అలాంటి వారికి ఉపయోగకరంగా ఈ చలివేంద్రాలు, గ్రీన్‌షెల్టర్లు మారాయి. ఏటా జీవీఎంసీ యంత్రాంగం తన దైనందిన పనులతోపాటు, సామాజిక బాధ్యతలో భాగంగా వేసవిలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. ఈసారి మాత్రం అదనంగా గ్రీన్‌షెల్టర్లను కూడా నిర్మించారు. ద్విచక్ర వాహనాలపై దూరప్రయాణం చేసేవారు కాసేపు ఆగి, సేదతీరేందుకు ఇవి బాగా ఉపయోగపడుతున్నట్లు వాహనదారులు చెప్తున్నారు. జాతీయ రహదారిపై ప్రైవేట్ బస్సుల కోసం ఎదురుచూసేవారికి, బస్‌షెల్టర్ లేని చోట బస్సుల కోసం నిరీక్షించేవారికి కూడా ఇవి బాగా ఉపయోగపడుతున్నాయి.



నెహ్రూచౌక్ బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం

జూన్ 15 వరకు

> పట్టణ పరిధిలో ఏటా వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తాం. పాదచారులకు, వాహనచోదకుల సౌకర్యార్థం ఈసారి గ్రీన్‌షెల్టర్లు ఏర్పాటు చేశాం. ఇందుకు రూ.7 లక్షల వరకు వెచ్చించాం. చలివేంద్రాల్లో ఎప్పటికప్పుడు తాగునీటిని అందుబాటులో ఉంచేలా కూలీల ఏర్పాటుకు కాంట్రాక్ట్ అప్పగించాం. జూన్ 15 వరకు వీటిని కొనసాగిస్తాం. – చిరంజీవి, ఈఈ, జీవీఎంసీ

సొంతింటి కల సాకారం చేసుకోండి

కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సొంతింటి కలను సాకారం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ కోరారు. ఆక్సాహేబుపేటలో వైఎస్సార్ జగనన్న కాలనీలో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. లే అవుట్‌ను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. సమస్యలు ఉంటే తెలపాలని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తోందని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మెటీరియల్ అందుబాటులో ఉందని త్వరితగతిన నిర్మాణాలు ప్రారంభించాలన్నారు. ఎంపీడీవో చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, పీఆర్ జేఈ వర్మ, వైఎస్సార్ సీపీ నాయకుడు రాజీవ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఆక్సాహేబుపేటలో లే అవుట్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ప్రత్యేకాధికారి ఉదయశ్రీ

'బీజేపీకి చరమగీతం పలకాలి'

అనకాపల్లిటౌన్ : బీజేపీ ప్రభుత్వానికి చరమగీతం పలికే రోజులు అది దగ్గర్లోనే ఉన్నాయని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొణతాల హరనాథ బాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తొలుత నోట్ల రద్దుతో బ్లాక్‌మనీ అంతమవుతుందని చెప్పి, కొత్తగా రూ.2వేల నోట్లు వాడుకలోకి తెచ్చిన ప్రధాని మోదీ, ఇపుడు ఆ నోట్లు రద్దు చేస్తేనే అవినీతి అంతమవుతుందని చెప్పడం సిగ్గుచేటన్నారు. బీజేపీ అవినీతి బాగోతం దేశ ప్రజలు చూస్తున్నారని ఎద్దేవా చేశారు. అధికారం ఉంది కదా అని నోటికొచ్చినట్టు మాట్లాడటం, మళ్లీ నోట్ల రద్దు చేయడాన్ని దేశ ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు.

చూచుకొండ సర్పంచ్‌కు ఘన సత్కారం

మునగపాక : చూచుకొండ పంచాయతీ జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎంపికైన సందర్భంగా శనివారం సర్పంచ్ దొడ్డి సూరప్పారావుకు ఘన సత్కారం నిర్వహించారు. చూచుకొండ గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడంలో భాగంగా ఉన్నతాధికారులు జిల్లాస్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేసిన విషయం తెలిసిందే. క్లీన్ విలేజ్ కార్యక్రమంలో చూచుకొండకు సర్పంచ్ సూరప్పారావు అందించిన సేవలకుగాను అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు, ఎమ్మెల్యే రమణమూర్తిరాజు శాలువా కప్పి సత్కరించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామానికి అవసరమయ్యే మౌలిక సదుపాయాలు కల్పించడంలో సూరప్పారావు అందించిన సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీటీసీ కాండ్రేగుల కిరణ్‌కుమార్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పెంటకోట హరేరామ పాల్గొన్నారు.



సర్పంచ్ సూరప్పారావును సత్కరిస్తున్న ఎంపీ డాక్టర్ సత్యవతి, ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

పాలిసెట్‌లో ఆస్క్ విద్యార్థుల ప్రతిభ

అనకాపల్లి రూరల్ : పాలిసెట్–2023లో ఆస్క్ ఇంజినీరింగ్ కళాశాలలో కోచింగ్ తీసుకున్న విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ వసంత రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. తమ కళాశాలలో పాలిసెట్‌కు గత నెల 21 నుంచి మే 9 వరకు ఇచ్చిన ఉచిత శిక్షణకు 243 మంది హాజరు కాగా వారిలో 228 మంది శనివారం విడుదల చేసిన ఫలితాల్లో అర్హత పొందినట్టు వెల్లడించారు. రాష్ట్రంలో 84 ప్రభుత్వ, 175 ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లమో కోర్సులు అందుబాటులో ఉన్నట్టు పేర్కొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మునగపాక : ప్రతి ఒక్కరూ ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తిమ్మరాజుపేట సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి కోరారు. తిమ్మరాజుపేటలో శనివారం ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తీసుకువచ్చిన ఫ్యామిలీ డాక్టర్ విధానం అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుస్తుందన్నారు. గ్రామంలోనే సేవలందించే కార్యక్రమం ఎంతో అద్భుతంగా ఉంటుందన్నారు. గతంలో వైద్య సేవలకోసం సుదూర ప్రాంతమైన చూచుకొండకు వెళ్లాల్సి వచ్చేదని, ఇక అలాంటి సమస్యలు లేవన్నారు. డాక్టర్ మానస వైద్య సేవలందించారు. ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణి, ఏఎన్ఎం ప్రేమకుమార్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాలిసెట్‌లో రాకేష్‌కు 190వ ర్యాంకు



చొప్ప రాకేష్

సబ్బవరం: సబ్బవరం మండలం జీవీఎంసీ 88వ వార్డు పరిధిలోని వెదుళ్లనరవ గ్రామానికి చెందిన చొప్ప రాకేష్ పాలిసెట్‌లో మెరిశాడు. పాలిసెట్‌లో 114/120 మార్కులు రావడంతో రాష్ట్రస్థాయిలో190వ ర్యాంకు వచ్చింది. రాకేష్ తండ్రి కనకరాజు వ్యవసాయ కూలీ కాగా తల్లి వెంకటలక్ష్మి గృహిణి. గాజువాక చైతన్యలో 10వ తరగతి చదివాడు.పాలిటెక్నిక్ పూర్తి చేసి ఐఐటీలో మంచి ర్యాంకు సాధించడమే లక్ష్యమని రాకేష్ చెబుతున్నాడు. మంచి ఉద్యోగం సంపాదించి తల్లిదండ్రులకు అండగా ఉంటానని తెలిపాడు.

సంక్షేమ వారధులు వలంటీర్లు

- 'వలంటీర్లకు వందనం'లో ఎమ్మెల్యే అదీప్‌రాజ్



ఉత్తమ గ్రామ వలంటీర్లకు అవార్డులు ప్రదానం చేసిన ఎమ్మెల్యే అదీప్‌రాజ్



ఉత్తమ వలంటీర్లతో ఎమ్మెల్యే అదీప్‌రాజ్, ఎంపీపీ వెంకట పద్మలక్ష్మి, జెడ్పీటీసీ రాజు

పరవాడ: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేసి ప్రతీ ఇంట్లో వెలుగులు నింపుతున్న వలంటీర్ల సేవలు అమోఘమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కొనియాడారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన 'వలంటీర్లకు వందనం' కార్యక్రమంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రభుత్వం వరుసగా మూడో ఏడాది ప్రకటించిన అవార్డులను వలంటీర్లకు ఎమ్మెల్యే ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థలో వలంటీర్లే కీలక భూమిక పోషిస్తున్నారన్నారు.వారికి కేటాయించిన యాభై ఇళ్లకు వెళ్లి వారిలో ఓ కుటుంబ సభ్యునిగా మమేకమై జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, తహసీల్దారు వి.ప్రకాశరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు బి.అప్పలరాజు, బి.నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ జీజే కళాశాల ప్రిన్సిపాల్‌గా నారాయణరావు



నారాయణరావు

పరవాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జి.వి.నారాయణరావు బాధ్యతలు స్వీకరించారు. ఇంటర్మీడియట్ బోర్డు నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎన్‌డీఎల్ కుమారి నుంచి ఆయన చార్జి తీసుకున్నారు. కళాశాలలో నాణ్యమైన విద్య అందే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

డ్యాన్స్ అదరహో



డ్యాన్స్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సబ్బవరం: సబ్బవరం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి వి.శిరీష ఆధ్వర్యంలో శనివారం బుక్ రీడింగ్, డ్యాన్స్ షో నిర్వహించారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు శిబిరం ముగింపు రోజున బహుమతులు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఖోఖోలో ఏఎంఏఎల్ విద్యార్థుల ప్రతిభ



ఖోఖోకు ఎంపికైన విద్యార్థులతో ఏఎంఏఎల్ కళాశాల యాజమాన్యం

అనకాపల్లి రూరల్ : ఖోఖోలో అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఇటీవల జరిగిన ఖోఖో ఎంపికల్లో ఈ కళాశాలకు చెందిన 8 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు కళాశాల కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శనివారం కళాశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో రాష్ట్ర పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. వీరంతా విశాఖ జిల్లా జట్టు తరపున త్వరలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. ఆ పోటీల్లో కూడా ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గవర్నింగ్ బాడీ అధ్యక్షుడు కె.ఎస్.ఎన్.మంగరాజు, సభ్యుడు వాసిరెడ్డి బాలకృష్ణ, సూపరింటెండెంట్ పి.అనూరాధ, ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ కేవీఎస్ నాయుడు, వై.నాయుడు, కోచ్ ఎ.నూకయ్య, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి

- ఎంపీపీ వెంకట పద్మలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకట పద్మలక్ష్మి

పరవాడ: వేసవిని దృష్టిలో పెట్టుకుని మండలంలో మరమ్మతులకు గురైన మంచినీటి పథకాలను తక్షణమే వినియోగంలోకి తేవాలని ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి అధికారులను ఆదేశించారు. ఎక్కడా తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక దృష్టిసారించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం అర్థవంతంగా సాగింది. ఎంపీపీ మాట్లాడుతూ మండల సమావేశాల్లో సభ్యులు ప్రస్తావించిన సమస్యలను లిఖిత పూర్వకంగా అధికారులకు సమర్పిస్తే వెంటనే చర్యలు చేపడతామని చెప్పారు. సమావేశంలో జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సభ్యులు ప్రస్తావించిన అంశాలు

- పి.బోనంగిలో అపరిష్కృతంగా ఉన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని సర్పంచ్ బండారు కల్పన రాజశేఖర్ కోరారు. తహసీల్దార్ ప్రకాశరావు స్పందిస్తూ త్వరలో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.
- ఊటగెడ్డ సమీపంలో ఓ ప్రైవేటు లేఅవుట్ యాజమాన్యం ప్రభుత్వ స్థలంలో రోడ్డు వేసినా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోలేదని భర్నికం సర్పంచ్ పెదిశెట్టి పూజాశేఖర్ ఆరోపించారు. సమస్య కోర్టు పరిధిలో ఉన్నందువల్ల ఎలాంటి చర్యలు తీసుకోవడం సాధ్యంకాదని తహసీల్దారు ప్రకాశరావు చెప్పారు.
- రావాడలో అటవీశాఖ ఆధీనంలో ఉన్న భూమిపై జాయింట్ సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిని ప్రజోపయోగ కార్యక్రమాలకు వినియోగించాలని సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు కోరారు.
- ముత్యాలమ్మపాలెం శివారు దిబ్బపాలెంలో అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టును స్థానికులకు కేటాయించాలని సర్పంచ్ చింతకాయల సుజాతముత్యాలు కోరారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని సబ్బవరం ఐసీడీఎస్ సీడీపీవో లలితకుమారి చెప్పారు.
- జల్‌జీవన్‌మిషన్ పథకంలో మండలంలో ఇప్పటి వరకు 25 గ్రామాల్లో ఇంటింటి కుళాయి పనులు పూర్తి చేశామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ షణ్ముఖ చెప్పారు. 18 గ్రామాల్లో పనులు చురుగ్గా జరుగుతున్నాయని, మిగిలిన 17 గ్రామాలకు టెండర్లు ఖరారు కాలేదని ఏఈ చెప్పారు.

సూక్ష్మ నీటి సేద్యంతో అధిక దిగుబడి



బిందు సేద్యం యూనిట్‌ను పరిశీలిస్తున్న పీడీ లక్ష్మి

కోటవురట్ల : సూక్ష్మ సాగు నీటి సేద్యంతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధ్యపడతాయని ఏపీఎంఐపి పీడీ జి.వి.లక్ష్మి అన్నారు. మండలంలోని యండపల్లి, బోడపాలెం, కోటవురట్ల, టి.జగ్గంపేట గ్రామాలలో ఏపీఎంఐపి అధికారుల బృందం శనివారం పర్యటించింది. రైతులతో మాట్లాడి, పొలాల్లో అమర్చిన బిందు సేద్యం పరికరాలు, స్ప్రింకర్లను పరిశీలించారు. పీడీ మాట్లాడుతూ ఉద్యానవన శాఖ ద్వారా డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను రాయితీపై అందిస్తున్నారన్నారు. 2022–23 సంవత్సరంలో జిల్లాలో 832 హెక్టార్లు బిందు సేద్యంలో సాగవుతున్నట్లు తెలిపారు. 2023–24 సంవత్సరంలో 1200 హెక్టార్లు లక్ష్యంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. బిందు సేద్యం వల్ల మొక్కకు కావలసిన నీటిని బొట్టు బొట్టుగా నేరుగా మొక్కకు అందించడం వల్ల నీటి వృథా ఉండదన్నారు. దీని వల్ల 50 శాతం వరకు నీటిని ఆదా చేయవచ్చన్నారు. నీటితో పాటు సూక్ష్మ పద్ధతిలో ఎరువులను కూడా అందించడం వల్ల ఖర్చు తగ్గుతుందన్నారు. డ్రిప్ పద్ధతిలో పండ్ల తోటలు, కూరగాయలు, కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటలు సాగు చేయవచ్చని తెలిపారు. అపరాలు, నువ్వులు తదితర పంటలకు స్ప్రింకర్లు అమర్చడం ద్వారా నీరు వృథా అవ్వదన్నారు. ఎరువుల ఖర్చు తగ్గడమే కాకుండా నాణ్యమైన అధిక దిగుబడిని సాధించవచ్చన్నారు. డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం, ఐదెకరాల పైబడి 12.50 ఎకరాలు లోపు రైతులకు 50 శాతం రాయితీపై ఇస్తున్నట్టు తెలిపారు. స్ప్రింకర్లను చిన్న, సన్నకారు రైతులకు 55 శాతం, ఇతర రైతులకు 45 శాతం రాయితీపై ఇస్తున్నట్టు తెలిపారు. అర్హత కలిగిన రైతులు తగు వివరాలతో ఆర్బీకేలలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఏవో సత్యవేణి, వీఏఏలు, వీహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి అమూల్ పాలకేంద్రాలు దోహదం



పాడి రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న పశువైద్యాధికారి ప్రదీప్‌కుమార్

మునగపాక : మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు అమూల్ పాలకేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని మండల పశువైద్యాధికారి లావేటి ప్రదీప్ కుమార్ అన్నారు. అమూల్ పాలకేంద్రాలు ఏర్పాటు చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా శనివారం మునగపాకలో పాలు పోసే రైతులను ప్రోత్సహించేందుకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమూల్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలే పాలను సరఫరా చేస్తూ వచ్చే ఆదాయంపై కుటుంబాలను పోషించుకోవడం శుభ పరిణామమన్నారు. పశువుల కొనుగోలులో రైతులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. పశుదాణా విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు మహిళా రైతులు పాల్గొన్నారు.

'విశాఖ ఉక్కును ప్రభుత్వ సంస్థగా కొనసాగించాలి'



828వ రోజు ఉక్కుదీక్షలో కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న పోరాట కమిటీ

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగిస్తామని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలి జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 828వ రోజుకు చేరుకున్నాయి, ఈ దీక్షలో ఉక్కు కర్మాగారంలోని పలు విభాగ కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైల్వేజోన్ ఇవ్వకుండా, ప్రత్యేకహోదా ప్రకటించకుండా ఎన్నికల హామీని తుంగలో తొక్కిన బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. కార్మిక హక్కులను నేరవేర్చని గత ప్రభుత్వాలు ఇప్పటికీ దీనస్థితిలో ఉన్న విషయాన్ని గమనించాలన్నారు. కార్మిక శక్తిని, ప్రజల ఆందోళనను గుర్తించి విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు, మద్దతుదారులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుకు దరఖాస్తులు

అనకాపల్లి రూరల్ : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకానికి అవకాశం ఇచ్చినట్టు ఎంపీడీవో కె ధర్మారావు తెలిపారు. మామిడి, జీడి మామిడి, జామ, సపోటా, కొబ్బరి మొక్కల పెంపకానికి ప్రభుత్వం అనుమతించిందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగపర్చుకోవాలని ఆయన కోరారు. పండ్ల తోటల పెంపకానికి ఆసక్తి ఉన్న రైతులు మొక్కల కోసం పంట భూమి పాసు పుస్తకంతో పాటు ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు జెరాక్సు కాపీలతో మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.